సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 2 । జూన్ । 2025



కడపలో దారుణ హత్య

కడపలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. భార్యభర్తల మధ్య గొడవల నేపథ్యంలో.. అత్తింటి వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు మృతుడి సంబంధీకులు ఆరోపిస్తున్నారు. -8లో



కొత్త ప్రపంచం.. బంగారు భవిష్యత్తుకు బీజం

ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ ప్రధానమైనది. ఈ దశలో వేసే అడుగులే భవిష్యత్తును నిర్దేశిస్తాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.114
రెండోరకం	రూ.64	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1880 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 2వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

కలికిరి: పట్టణంలో వెలసిన పురాతన ఆలయం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉదయం తిరుమంజనం, రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 3న ధ్వజారోహణం, పల్లకీ సేవ, 4న సింహ వాహన సేవ, 5న హనుమంత వాహనం, 6న శేష వాహనం, 7న మోహిని, గజ వాహనం, 8న కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ, 9న బ్రహ్మ రథోత్సవం, 10న పార్వేట, డోపోత్సవం, 11న చక్రస్నానం, ధ్వజావరోహనం, 12న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అర్చకులు మురళీధరాచార్యులు కోరారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

రాయచోటి: అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన సెక్రటరీ కరిమిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈనెల నాలుగో తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కడప-గుంతకల్ మధ్య ప్యాసింజర్ రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప– గుంతకల్ మధ్య ప్రత్యేక ప్యాసింజర్ రైలును సోమవారం నుంచి నడుపుతున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ రైలు నంబర్ 07521గా నిర్ణయించారు. ఉదయం 7:45 గంటలకు కడపలో బయలుదేరి 8:13కు ఎర్రగుంట్ల, కొండాపురానికి 8:39, తాడిపత్రికి 9:13, గుత్తి 10:3, గుంతకల్‌కు 11:45 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07522) గుంతకల్లులో మధ్యాహ్నం ఒకటిన్నరకు బయలుదేరి, గుత్తికి 1:55, తాడిపత్రికి 2: 40, కొండాపురం 3:13, ఎర్రగుంట్ల 3:43, కడపకు సాయంత్రం 5:10 గంటలకు వస్తుంది. మొత్తం 22 బోగిలతో ఈ రైలు నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

సుండుపల్లెలో తమ్ముళ్ల తిరుగుబాటు



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు భగవాన్ సహదేవరెడ్డి

సుండుపల్లె: తాత్కాలిక ఇన్‌చార్జిగా కొనసాగుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజుపై సుండుపల్లెలో తమ్ముళ్ల తిరుగుబాటు ప్రకటించారు. ఆదివారం సుండుపల్లెలో పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సహదేవరెడ్డి స్వగృహంలో అన్ని మండలాల టీడీపీ నాయకులు, బత్యాల వర్గీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి పోస్ట్ ఖాళీగా ఉందని, ఇంత వరకు తమ పార్టీ అధినేత చంద్రబాబు ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సుగవాసికి అధికారికంగా ఇన్‌చార్జి పదవి ఇవ్వలేదని, దీంతో ఆయన రాయచోటి వెళ్లిపోయారని, ఇప్పుడు ఇన్‌చార్జి ఎవరూ లేరని పలువురు వ్యాఖ్యానించారు. ఇప్పటికీ పార్టీ రికార్డుల్లో బత్యాలే ఇన్‌చార్జిగా ఉన్నారని గుర్తు చేశారు. మహానాడు వరకు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సమన్వయకర్తగా ఉంటారని స్పష్టంగా చెప్పారని, కానీ ఆయన ఇన్‌చార్జి అని వేసుకుంటున్నారని విమర్శించారు. ఇది సమంజసం కాదని నాయకులు అన్నారు. సుగవాసి సుబ్రమణ్యంకు ఇన్‌చార్జి ఇవ్వలేదని, కాబట్టి ఆయన స్థానంలో బత్యాల చెంగలరాయుడుకు రాజంపేట ఇన్‌చార్జి ఇవ్వాలని, ఆయనే అన్ని విధాలా అర్హుడని అన్నారు. ఈ సమావేశంలో అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు బత్యాల వర్గీయులు, టీడీపీ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి పోయె.. కష్టాలు వచ్చె



ఈ ఫోటోలో కనిపిస్తున్న వృద్ధు రాలిపేరు అమ్మణ్ణి. గాలివీడు మండలం అరవీడుకు చెందిన ఈమె ఇంటికి సరుకులు వస్తాయో, రావోనన్న ఆందోళనతో అతి కష్టంపై సమీపంలోని డీలర్ షాపుకు వచ్చింది. ప్రభుత్వం ఇంటి వద్దకు సరుకులు ఇస్తామంటున్నా ఎప్పుడు ఇస్తారోనన్న ఆందోళనతో నేరుగా డీలర్ వద్దకు వచ్చినట్లు తెలియజేసింది.

- జిల్లాలో నిలిచిపోయిన 350కి పైగా రేషన్ వాహనాలు
- డీలర్ల వద్ద సరుకులు తెచ్చుకునేందుకు అగచాట్లు
- క్యూలైన్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి
- పలు చోట్ల సర్వర్ల మొరాయింపు
- వైఎస్ జగన్ సర్కార్ హయాంలో ఇంటి ముంగిటకే రేషన్



రేషన్ షాపు వద్ద గుమికూడిన కార్డుదారులు



గాలివీడు మండలంలో రేషన్ దుకాణం వద్ద క్యూలైన్‌లో కార్డుదారులు

సాక్షి రాయచోటి: ప్రతినెల క్రమం తప్పకుండా ఇంటి ముంగిటకే అందివచ్చే రేషన్ సరుకుల బండ్లు మాయమయ్యాయి. కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయంతో అవి మూలకు చేరాయి. కాలం మారింది...మళ్లీ పాతరోజులే వచ్చాయి. డీలర్ల వద్ద క్యూలైన్లలో నిలుచుని సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఇంటికే వాహనాల ద్వారా సరుకులు చేర్చే విధానానికి ప్రస్తుత సర్కార్ మంగళం పాడడంతో కార్డుదారుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సర్వర్ సమస్యలు...క్యూలైన్లలో ఇబ్బందులు ఇలా చెబుతూ పోతే అనేక అవాంతరాల నడుమ రేషన్ సరుకులు కార్డుదారులకు అందడం సంకటంగా పరిణమిస్తోంది.

డీలర్‌షాపుల వద్ద పెరిగిన క్యూలైన్లు..

జిల్లాలో 1123 రేషన్ దుకాణాలు ఉండగా, వాటి పరిధిలో 4,97,969 కార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డుల ద్వారా ప్రతినెల 14,82,094 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 65 సంవత్సరాలు పైబడిన కార్డుల సంఖ్య 53,707 ఉండగా, 69,336 మంది సభ్యులు ఉన్నారు. అయితే కూటమి సర్కార్ డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీకి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టింది. తొలిరోజు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాయచోటి పరిధిలోని చెన్నముక్కపల్లె, రెడ్డివారిపల్లెల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని అనేక రేషన్‌షాపుల వద్ద తొలిరోజే క్యూలైన్లలో నిలబడి సరుకులు తెచ్చుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. ఆదివారం కావడంతో కొంత మేర కార్డుదారులు తక్కువగా ఉండడంతో అరగంట, గంట పాటు క్యూలైన్లలో వేచి ఉండి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు, రైల్వేకోడూరు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ క్యూలైన్లలో నిలుచుని రేషన్ తెచ్చుకున్నారు. ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిస్తామని చెబుతున్నప్పటికీ ప్రస్తుతానికి అమలు కాలేదు. దీంతో తర్వాత సరుకులు అందుతాయో లేదోనన్న ఆందోళనలతో వృద్ధులు కూడా డీలర్ షాపుల వద్దకు వచ్చి సరుకులు తీసుకెళ్లడం కనిపించింది.

తొలిరోజు మొరాయించిన సర్వర్లు



జిల్లాలో తొలిరోజు కార్డుదారులకు సర్వర్ సంకటంగా మారింది. జిల్లాలోని పలుచోట్ల డీలర్ల వద్ద ఉన్న మిషన్లలో సర్వర్ సమస్య తలెత్తడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల చాలాసేపు ఎదురుచూసి పని చేయకపోవడంతో తిరుగుముఖం పట్టారు.

ప్రభుత్వ పాఠశాలలో చౌక దుకాణం



బలకవారిపల్లె పాఠశాలలో ప్రారంభించిన చౌక దుకాణం

బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆదివారం చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించారు. అయితే ములకలచెరువు మండలం బలకవారిపల్లె చౌక దుకాణాన్ని సంబంధిత డీలర్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వ ఆస్తిలో అందులోనూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. దానికి తోరణాలు కట్టి అధికారులు ప్రారంభించడంపై స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఈనెల 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్న వేళ విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాలను సిద్ధం చేయాల్సి ఉండగా చౌక దుకాణం ప్రారంభించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చౌక దుకాణం తరలించాలని ఇక్కడ నిర్వహించ రాదని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నేరుగా ఇంటికి సరుకులు



2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రేషన్ కష్టాలకు తెర పడింది. నేరుగా ఎండీయూ వాహనాలు..ఆపరేటర్లు, సూపర్‌వైజర్ల ద్వారా నేరుగా కార్డుదారుల ఇంటికే సరుకులు అందించారు. ఎక్కడికక్కడ వాహనాలు ఒక ప్రత్యేక సైరన్ మోగగానే...రేషన్ బండి వచ్చిందని నేరుగా ఇంటివద్దనే సరుకులు తీసుకునేవారు. జిల్లాలో 350కి పైగా ఉన్న ఎండీయూ వాహనాలు ప్రస్తుతం మూలకు చేరాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఆపరేటర్లు, సూపర్‌వైజర్ల ఉపాధిపై దెబ్బపడగా, ప్రజలకు రేషన్ ఇబ్బందులు తప్పడం లేదు. ఏది ఏమైనా వైఎస్సార్‌సీపీ హయాంలో ఎలాంటి కష్టాలు లేకుండా సరుకులు అందేవని, ప్రస్తుతం డీలర్ల వద్దకు వెళ్లి క్యూలైన్లలో నిలబడి తీసుకోవడం పెద్ద సమస్యగా మారిందని పలువురు వాపోతున్నారు.

ఇంటి వద్దకే రేషన్ బాగుండేది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ విధానం మాలాంటి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఎవరూ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండేది కాదు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడంవల్ల సమస్యలు ఎదురవుతాయి. కార్డుదారులు ఎక్కువ మంది వచ్చినప్పుడు గంటల కొద్ది వేచి ఉండాలి. వృద్ధులు, మహిళలు సరుకులు మోసుకెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎఫ్‌పీ షాపులను పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల మాలాంటి కార్డుదారులకు మళ్లీ సమస్యలు మొదలయ్యాయి. –ప్రమీలదేవి, సి.ఎం కొత్తపల్లె, సంబేపల్లె మండలం

రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



బియ్యం పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలోని 1123 చౌక ధరల దుకాణాలు ద్వారా పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం రాయచోటిలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం చెన్నముక్కపల్లి, రెడ్డివారిపల్లిలో రేషన్ పంపిణీని పునఃప్రారంభించారు. అనంతరం 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటివద్దనే రేషన్ అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1123 చౌక ధరల దుకాణాలలో 4,97,969 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. ఇందులో 65 సంవత్సరాల పైబడిన కార్డుల సంఖ్య 53,707గా ఉందన్నారు. ఈ కార్డుల ద్వారా 69336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని తెలిపారు. ప్రతినెల 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. ఏక లేదా ద్వి సభ్య కార్డుల్లోని 65 సంవత్సరాలపైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటివద్దనే రేషన్ పంపిణీ ఒకటో తేది నుంచి 05వ తేది వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సమయంలో పంపిణీ చేస్తారన్నారు.. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు ప్రభుత్వాన్ని నిలదీద్దాం

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు

రాజంపేట టౌన్: విద్యార్థులు మహిళలు, రైతులను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ చేపట్టనున్న వెనునపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని ఆకేపాటి పిలుపునిచ్చారు. రాజంపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే వెన్నుపోటుదినం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించారని ఆరోపించారు. . వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయించడమే కాకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజలను పీడిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయని ఆకేపాటి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. 2019 ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను ఏడాదిలోపే 99 శాతం అమలు చేశారని, అయితే చంద్రబాబునాయుడు అందుకు భిన్నంగా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు.ఇలాగే పాలన సాగిస్తే ప్రజలే బుద్ధిచెప్పే రోజు త్వరలోనే వస్తుందన్నారు. చంద్రబాబునాయుడు రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడన్నారు. వెన్నుపోటు దినంతో ఆయన కళ్లు తెరిపిస్తామన్నారు. బాబుకు సంపద సృష్టిచడం తెలియదని...సంపద ఎలా సృష్టించాలో ప్రజలే సలహాలు ఇవ్వాలనే స్థాయికి దిగజారిపోయారని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు ఆకేపాటి వేణు గోపాల్‌రెడ్డి, జెనుగు కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ, మిర్యాల సురేఖ, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, సనిశెట్టి నవీన్, గీతాల నరసింహారెడ్డి, ఖాజా మొహిద్దీన్, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, జీవీ.సుబ్బరాజు, జాహీద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలకు వేళాయె

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కీలకమైనస్థానాల కోసం ఉద్యోగుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కొందరు 'డిమాండ్' ఉన్న 'సీటు'ను పొందడానికి ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందు కోసం మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో బది'లీలలు' జరగకుండా చర్యలు చేపట్టాలి.

- గైడ్‌లైన్స్‌ను జారీ చేసిన పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్
- ఈ నెల 19 వరకు ప్రక్రియ
- 20 నుంచి బదిలీలపై నిషేధం
- కీలకమైన స్థానాల కోసం గట్టి పోటీ



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలపై టెన్షన్ వాతావరణం నెలకొంది. కొన్ని కారణాల వల్ల ట్రాన్స్‌ఫర్స్ ప్రక్రియపై సందేహాలు నెలకొన్నాయి. ఎట్టకేలకు ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం జీఓ ఆర్టీ నంబరు 344, 399, ఈ–ఫైల్ నంబరు 2840767ను జారీ చేస్తూ, గైడ్‌లైన్స్‌ను విడుదల చేసింది.

అనుకూలమైన స్థానాల కోసం ఆరాటం

కడపలోని వైద్య ఆరోగ్య శాఖ జోన్–4 కార్యాలయంతో పాటు ఈ శాఖ పరిధిలోకి వచ్చే రాయలసీమ జిల్లాల్లోని ఆరోగ్య శాఖల్లో పలు కీలకమైన స్థానాలు ఉన్నాయి. అలాంటి చోటికి వెళ్లడానికి ఉద్యోగులు ఉబలాటపడుతున్నారు. ఉదాహరణకు కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో బదిలీల కారణంగా అక్కడ పని చేసే సీనియర్ అసిస్టెంట్స్ మరొక చోటికి వెళ్లాల్సి వుంది. ఆ సీటులోకి రావడానికి ఇప్పటికే పలువురు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అదే కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గోపాల్‌రెడ్డి మే 31వ తేదీన పరిపాలనా అధికారిగా పదోన్నతిపొంది, పదవీ విరమణ పొందారు. ఇప్పుడు ఈ స్థానంపై రాయలసీమ వ్యాప్తంగా పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల కన్ను పడింది. ఇది చాలా ప్రధానమైన సీటు కావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఇందుకు కొందరి అండదండలు కూడా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. పదోన్నతుల ద్వారా ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేయాలి. అంతలోపే ట్రాన్స్‌ఫర్స్ రావడంతో వేరొక ప్రాంతంలో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ బదిలీపై ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. అసలు సంగతి ఏమిటంటే..'పదోన్నతులు వస్తే ఎవరిని తేవాలి లేదా ఆ లోపు బదిలీలు గనుక జరిగితే ఎవరిని తీసుకురావాలి, లేదా మరే మార్గం ఏమైనా ఉందా..!' అనే ఎత్తుగడల్లో ఉన్నట్లు సమాచారం. ట్రాన్స్‌ఫర్స్ కారణంగా వైద్య ఆరోగ్య శాఖల్లో ఉత్కంఠ..సందడి వాతావరణం నెలకొననుంది.



20 రోజుల పాటు బదిలీల ప్రక్రియ

మే 31వ తేదీ నుంచి జూన్ 19వ తేదీ వరకు 20 రోజుల పాటు బదిలీల ప్రక్రియ సాగుతుంది. 23వ తేదీన ఉద్యోగులు రిలీవ్ కావాలి. 20వ తేదీ నుంచి మళ్లీ బదిలీలపై నిషేధం ఉంటుంది. ఒకే స్థానంలో ఐదేళ్లకు పైగా విధులను చేపడుతున్న ఉద్యోగులంతా ట్రాన్స్‌ఫర్ అవుతారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి తదితర ప్రధాన ఆసుపత్రుల్లో పనిచేస్తున్న మినిస్టీరియల్ స్టాఫ్ (జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరింటెండెంట్ తదితరులు) ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు నిండిన వారు బదిలీ అవుతారు. ఒకే చోట రెండేళ్లకు పైగా పనిచేస్తున్న వారు అభ్యర్థన బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లు, ఉద్యోగులైన భార్యాభర్తలు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం బదిలీలను చేపడుతారు.

క్యారమ్ టోర్నమెంట్‌కు విశేష స్పందన



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయి క్యారమ్ టోర్నమెంట్‌కు విశేష స్పందన లభించింది. కడపలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ కేటగిరీల్లో 50 మంది క్యారమ్స్ ఆటగాళ్లు పాల్గొన్నారు. అండర్ 9 ఇయర్స్ బాలురలో గోకుల్, మహేశ్వర్ జాయింట్ విన్నర్స్‌గా, రిషి రన్నర్‌గా నిలిచారు. అండర్ 11 బాయ్స్‌లో చరణ్‌సాయి విన్నర్‌గా, అడనాన్ రన్నర్‌గా, అండర్ 14 బాయ్స్‌లో కేఎల్ రంగనాథ్, చరణ్‌సాయి, బాలికల విభాగంలో షణ్ముఖప్రియ విన్నర్‌గా, ధరణి రన్నర్‌గా గెలుపొందారు. సీనియర్స్ మెన్ విభాగంలో నాగేంద్ర విన్నర్‌గా, మస్తాన్‌వల్లి రన్నర్‌గా నిలిచారు. ఎంపికైన వారు రాబోయే రోజుల్లో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా సీనియర్ క్యారమ్స్ క్రీడాకారుడు, ఏపీఎస్‌పీడీసీఎల్ రిటైర్డ్ ఏఈ నాగభూషణం క్రీడాకారులకు సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు. ప్రతి ఆదివారం ఇండోర్, డీఎస్ఏలో క్యారమ్ ఆటపై ఉచిత కోచింగ్ ఇస్తామని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలంకి గణేష్‌బాబు తెలిపారు.

కాళ్లు, చేతులు కట్టేసి..కడపలో వ్యక్తి దారుణ హత్య

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణం
- మామనే ప్రధాన నిందితుడు
- సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటాం
- కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు వెల్లడి


సయ్యద్ చాంద్‌బాషా (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో మసీద్ వీధిలో ఆదివారం సాయంత్రం సయ్యద్ చాంద్‌బాషా (36) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనపై అతని తల్లి సయ్యద్ జుబేదా, పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరంలోని రామకృష్ణ నగర్‌లో నివాసం వుంటున్న సయ్యద్ జుబేదా చిన్నకుమారుడు సయ్యద్ చాంద్‌బాషాకు, అశోక్‌నగర్ మసీద్ వీధిలో నివాసం వుంటున్న షేక్ మహబూబ్ బాషా కుమార్తె ఆయేషాకు 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు సంతానం. చాంద్‌బాషా ఆటో డ్రైవర్‌గాను, ఎలక్ట్రికల్ పనులు, ఇంకా తనకు వచ్చిన పనులను చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య ఆయేషా కడప నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో వివాహమైనప్పటి నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అతను అశోక్‌నగర్‌లోనే తన అత్తగారింటికి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని వుండేవాడు. వీరి మధ్య మనస్పర్థలు తీవ్రం కావడంతో పోలీసుస్టేషన్, కేసుల దాకా వెళ్లారు. గత ఆరునెలల నుంచి ఆయేషా తన పుట్టింటిలోనే వుంటూ పిల్లలను తనదగ్గరే పెట్టుకుంది. ఈ క్రమంలో పరస్పరం ఘర్షణ పడుతూనే వున్నారు. 20 రోజుల క్రితం ఆయేషా తండ్రి షేక్ మహబూబ్ బాషా కువైట్ నుంచి వచ్చాడు. ఒకసారి తన అల్లుడు సయ్యద్ చాంద్‌బాషాపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం చాంద్‌బాషా తల్లి జుబేదాకు దావత్ ఉందని చెప్పి వెళ్లాడు. తన అత్తారింటికి సమీపానికి వెళ్లాడు. ఆ సమయంలో మామ షేక్ మహబూబ్‌బాషా, వారి కుటుంబ సభ్యులు సయ్యద్ చాంద్ బాషాను తమ ఇంటికి తీసుకుని వెళ్లారు. చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి, కత్తి, కొడవలితో దారుణంగా నరికి హత్య చేశారు. రక్తపుమడుగులో పడివుండగా ప్రధాన నిందితుడైన షేక్ మహబూబ్‌బాషా, ఇతర కుటుంబ సభ్యులు పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు.


రక్తపు మడుగులో పడి ఉన్న సయ్యద్ చాంద్‌బాషా మృతదేహం


విలపిస్తున్న హతుని తల్లి సయ్యద్ జుబేదా

మామ, కుటుంబ సభ్యులే మా కుమారుడిని పొట్టన పెట్టుకున్నారు– హతుని తల్లి జుబేదా

తన కుమారుడు సయ్యద్ చాంద్ బాషా అన్ని పనులను చేసుకుంటూ తన భార్య ఆయేషాను, ముగ్గురు పిల్లలను పోషించేవాడు. తన కోడలికి, కుమారునికి మనస్పర్థలుండటం, తన కుమారుడిని మామ షేక్ మహబూబ్‌బాషా ఇంటి వద్దకు తీసుకుని వెళ్లి పొట్టన బెట్టుకున్నాడని ఆరోపించారు. మామతో పాటు, అతని భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులే కారణమని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ షేక్ మహబూబ్‌బాషానే తన అల్లుడు సయ్యద్ చాంద్‌బాషాను దారుణంగా హత్య చేశాడని, ఇందులో బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు తెలిపారు. కాగా పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు షేక్ మహబూబ్‌బాషాతో పాటు, ఇతర నిందితులు ఉన్నారని తెలిసింది.

కాగా ఈ హత్యను ఆప్ కి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, వక్ఫ్ పరిరక్షణ కమిటీ జేఏసీ నగర కో కన్వీనర్ ఒక ప్రకటనలో ఖండించారు.

అన్నా వదినలపై దాడి


గాయపడిన అన్నావదినలు ముర్తుజ, అక్తరున్నీసా

మదనపల్లె రూరల్ : అన్నా వదినలపై తమ్ముడి కుటుంబం దాడి చేసిన సంఘటన ఆదివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. కండ్రిగ గ్రామానికి చెందిన దంపతులు ముర్తుజా, అక్తరున్నీసాలకు గ్రామానికి సమీపంలో మామిడితోట ఉంది. అయితే వారికి తెలియకుండా ముర్తుజా తమ్ముడు షఫీవుల్లా ఇతరులకు మామిడితోటలో పంట ఒడుపుకునేందుకు విక్రయించాడు. ఈ విషయం తెలియని ముర్తుజా, అక్తరున్నీసా ఆదివారం తోటలోకి వెళ్లి పండ్లు కోశారు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదం జరిగింది. ఆవేశానికి లోనైన షఫీవుల్లా అన్న వదినలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికుల సాయంతో బాధితులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

క్లుప్తంగా

వాహనాలు ఢీ

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల సమీపంలో ఆదివారం రాత్రి బొలేరో పికప్ వాహనం-కారు ఢీ కొన్నాయి. స్థానికుల వివరాల మేరకు..కడపకు చెందిన బ్యాంకు ఉద్యోగులు కారులో చిత్తూరు నుంచి కడపకు వెళుతుండగా మోటకట్ల సమీపంలోకి రాగానే ఎదురుగా కోళ్ల లోడుతో వస్తున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ప్రాణ నష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య


మృతి చెందిన భాగ్యమ్మ

రామసముద్రం : కుటుంబ సమస్యలతో జీవితం మీద విరక్తి చెంది మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన నరసమ్మ, వెంకటరమణల కుమార్తె భాగ్యమ్మ(35)ను గుర్రంకొండ మండలం లక్కంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు మల్లికార్జునను ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన ఎనిమిదేళ్లకు భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో భాగ్యమ్మ పుట్టింటికి వచ్చేసింది .పిల్లలు లేని కారణంగా జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


దగ్ధమవుతున్న బైక్

ఖాజీపేట : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుగ్గబోయిన భాస్కర్(34) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఖాజీపేట మండలం నాగపట్నం వెళ్లే దారి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. గోపవరం మండలం వల్లెవారిపల్లి గ్రామానికి చెందిన దుగ్గనబోయిన భాస్కర్ (34) ఖాజీపేటలోని అగ్రహారంలో జరిగే జాతరకు వెళుతున్నానని శనివారం రాత్రి భార్య నాగేశ్వరికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున నాగపట్నం క్రాస్ వద్దకు రాగానే ఇతను నడుపుతున్న బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. భాస్కర్ పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రీ కొడుకులపై కత్తితో దాడి

మదనపల్లె రూరల్ : ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ వ్యక్తి కత్తితో దాడిచేయడంతో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడి, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. బాధితులు తెలిపిన మేరకు...కొత్తవారిపల్లె పంచాయతీ ఓబులరెడ్డిగారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి(63) కుమారుడు పృథ్వీ(23) అదే గ్రామానికి చెందిన ఫైనాన్సియల్ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న మదన్ మోహన్‌రెడ్డి, అరవింద్‌కు మధ్య ఆర్థిక వ్యవహారాల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. అరవింద్ రూ.40లక్షలు మదన్‌మోహన్‌రెడ్డికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పృథ్వీపై నగదు ఇప్పించేలా మదన్‌మోహన్ రెడ్డి ఒత్తిడి చేశాడు. పృథ్వీ సరిగ్గా స్పందించకపోవడంతో గతనెల 9న అతని ఇంటివద్ద ఉన్న రెండు వాహనాలకు మదన్‌మోహన్‌రెడ్డి నిప్పు అంటించి తగలబెట్టాడు. ఈ ఘటనపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్థిక లావాదేవీల కారణంగా వారి మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మదన్‌మోహన్‌రెడ్డి మరోసారి నగదు వసూలు విషయమై పృథ్వీ, అతడి తండ్రి కృష్ణమూర్తిలతో గొడవపడ్డాడు. ఆవేశానికి లోనై కత్తితో వారి ఇద్దరిపై దాడిచేశాడు. దాడిలో వారికి తీవ్రగాయాలు కాగా స్థానికుల సాయంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. ఘటనపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


కత్తిదాడిలో తీవ్రంగా గాయపడిన పృథ్వి, కృష్ణమూర్తి

ఏసీఏ అండర్–23 వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం

తొలి రోజు మ్యాచ్‌లో నెల్లూరు, కడప జట్ల విజయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏసీఏ సౌత్ జోన్ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభం రోజు అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 49.0 ఓవర్లలో 230 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కే. హెచ్. వీరారెడ్డి 47, పి. వికాస్ 42 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎస్. భార్గవ్ 4, ఎస్ అఖిల్ సాలుంకే 3, ఎన్. మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 231 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని జి. మన్విత్ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి సెంచరీ చేశారు. 77 బంతులను ఎదుర్కొని 109 పరుగులు చేశాడు. ఎస్. ఆతిక్ సల్మాన్ 33 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని జి. మల్లికార్జున 2, ఎం. దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో.. కడప జట్టు విజయం

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా ప్రారంభమైన మ్యాచ్‌లో కడప జట్టు 21 పరుగుల తేడాతో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 45.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం. వాసుదేవరాజు 99, సి విజయ్ రామ్‌రెడ్డి 61 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి. సాబ్జాన్ బాషా అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. సూర్య తేజ రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం 237 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 45.0 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని టి.తౌఫిక్ హుస్సేన్ 41, మనోజ్ రాజు 66 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీసుకున్నాడు.


109 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ జి. మన్విత్ రెడ్డి


99 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ వాసుదేవరాజు


ఐదు వికెట్లు తీసిన కర్నూలు బౌలర్ పి. సాబ్జాన్ బాషా


4 వికెట్లు తీసిన కడప బౌలర్ షేక్ ఆదిల్ హుస్సేన్

కష్టపడితేనే ఉద్యోగ సాధన సాధ్యం

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించే డీఎస్సీలో అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు సాధించాలంటే మరింత కష్టపడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో కడప యూటీఎఫ్ భవన్‌లో నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులకు 40 రోజులపాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవడం కోసం, నవతరంలో చైతన్య స్ఫూర్తిని నింపేందుకు యూటీఎఫ్ ఈ ఉచిత కోచింగ్ నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.క్రిష్టారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు సి.వనజా రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారావు, శ్రీనివాసులు ఆచారి, అభయ్, అనిల్ కుమార్, నరసింహులు, ప్రకాష్, బాషా, గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు కోరారు. ఆదివారం స్థానిక ఎస్‌కే గ్రాండ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కులగణన జరపకుండా స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఏ నివేదికల ఆధారంగా అమలు చేస్తారో చెప్పాలన్నారు. 50 శాతం సీలింగ్ నిబంధనను అధిగమించి బీసీలకు రిజర్వేషన్ కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల కులగణన ఏడాదిలోపు పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. కులగణన పూర్తయితే బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 శాతం పైగానే విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే కులగణనతోనే సాధ్యమన్నారు. ఇందుకు బీసీ సంఘాల నాయకులు ఉద్యమాలకు నడుం బిగించాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పార్లమెంట్ అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు.

బిట్ కాయిన్స్ పేరుతో మోసం

- రూ.15 లక్షలు నష్టపోయానని ఆవేదన
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


రామ్మూర్తి

బి.కొత్తకోట : బిట్ కాయిన్స్‌తో మంచి లాభాలు వస్తాయని, దీని లావాదేవీలు నిర్వహించాలని నమ్మించిన ఓ వివాహిత తనను మోసం చేసిందని బి.కొత్తకోట పీటీఎం రోడ్డుకు చెందిన కె.రామ్మూర్తి ఆదివారం వీడియో సందేశం విడుదల చేసి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..మదనపల్లెకు చెందిన యువతి వివాహం చేసుకుని తిరుపతిలో స్థిరపడింది. రామ్మూర్తి ఇంటి స్థలాల క్రయ విక్రయాలను చేస్తుంటాడు. దీనితో యువతి తల్లికి ఇంటి స్థలానికి సంబంధించి విక్రయించే విషయంలో పరిచయం కలిగింది. తర్వాత ఆ యువతి డబ్బును బిట్ కాయిన్స్‌లో పెట్టి లావాదేవీలు నిర్వహిస్తే భారీ ఆదాయం వస్తుందని నమ్మించింది. దీనితో రామ్మూర్తి ఆ యువతి ఖాతాకు రూ.4.35 లక్షలు జమ చేశాడు. తర్వాత విడత వారీగా రూ.5 లక్షలు నగదు ఇచ్చాడు. ఖర్చులు, ఆస్తి తనఖా పెట్టి తెచ్చిన అప్పుపై వడ్డీ, కలుపుకుని మొత్తంగా రూ.15 లక్షలు నష్టపోయినట్టు చెబుతున్నాడు. ఈ లావాదేవీల కోసం బ్యాంకులో కరెంట్ ఖాతాను తెరవాలని చెప్పి బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్‌ల్లో తిప్పింది. ఈ పరిస్థితులను గమనించిన రామ్మూర్తి తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా ఇస్తానని నమ్మిస్తూ ఇవ్వడం లేదని చెబుతూ బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను మోసపోయానంటూ వీడియో సందేశం విడుదల చేయగా అది వైరల్ అవుతోంది. దీనిపై పోలీసులు విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

బంగారు నగలకు మెరుగు పెడతామంటూ..

బీహార్ యువకులకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

సుండుపల్లె : బంగారు నగలకు మెరుగు పెడతామంటూ ఇద్దరు యువకులు మోసం చేసిన సంఘటన సుండుపల్లె మండలం కురవపల్లెలో జరిగింది. వివరాలు ఇలా.. గ్రామంలోని రమేష్ ఇంటి వద్దకు శనివారం బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులు వచ్చి బంగారు నగలకు మెరుగు పెడతామంటూ నమ్మబలికారు. దీంతో వారు బొట్టుగొలుసును ఇవ్వగా ఒక ద్రావణంలో బంగారాన్ని కరిగించుకొని పరారయ్యారు. అనంతరం పెదినేనికాల్వ గ్రామ పంచాయతీ మన్యంవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి బంగారం మెరుగుపెడతాం అని వారిని కోరగా వాళ్లు నిరాకరించారు. అదే గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనం చేస్తుండగా శబ్దం రావడంతో గ్రామస్తులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మూడు, నాలుగు రోజుల క్రితం కమ్మగుట్టపల్లె, సానిపాయిలోని కొన్ని ఇళ్లల్లో నగదు, బంగారు నగలు చోరీకి గురైనట్లు సమాచారం.


దొంగతనానికి పాల్పడిన బీహార్ యువకులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ విద్యార్థులకు 15వ ప్రజ్ఞా పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అంతరాలను తొలగించడానికి విద్య ఒక్కటే సాధనమన్నారు. విద్యార్థులకు మంచి ఆలోచనా దృక్పథం అవసరమన్నారు. వెనుకబాటు తనాన్ని అధిగమించాలంటే కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి తొగర్ల చిరంజీవులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలన్నారు. సోషల్ మీడియాను మంచికే ఉపయోగించుకోవాలన్నారు.


విద్యార్థికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్, చిరంజీవులు తదితరులు

కొత్త ప్రపంచం.. బంగారు భవిష్యత్తుకు బీజం

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు
- గాడితప్పితే జీవితమే గందరగోళం
- క్రమశిక్షణను అలవరుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు



రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులది కౌమార దశ. ఆ దశలో ఆలోచనలు, ఉత్సాహం ఇలా అన్నీ కూడా రాకెట్ కంటే వేగంగానే ఉంటాయి. అలాగే ఎన్నో కలలు, ఆశలు, ఆనందాలు, హర్ట్ అయ్యే సందర్భాలు, పాఠాలు, కాలేజీకి డుమ్మా కొట్టడాలు ఇలా అన్నీ కొత్తగా అనిపించేవే. ఒక్కమాటలో చెప్పాలంటే టెన్త్ వరకు తల్లిదండ్రుల చాటున పెరిగిన పిల్లలకు ఇంటర్‌లోకి ప్రవేశించగానే స్వేచ్ఛ రెక్కలు తొడుగుతుంది. అందువల్ల ఇంటర్మీడియట్‌లో చేరిన ప్రతి విద్యార్థికి అదో తెలియని అనుభూతిలా వుంటుంది. అదే సమయంలో కొత్త పరిసరాలు, కొత్త పరిచయాలు, సరికొత్త ఆలోచనలు ఇలా అన్ని కూడా విద్యార్థులకు కొత్తగా, వింతగా అనిపిస్తాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులు కౌమారదశలో ఉంటారు. కనుక ఈ దశలో వేసే అడుగులే భవిష్యత్తును నిర్దేశిస్తాయి. టీనేజీలో ఉన్న వారందరికి అన్నీ తెలిసినట్లే ఉంటాయి. కాని ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను తెలుసుకుంటే జీవితం విజయం వైపు పయనిస్తుంది.. కొత్త బంగారులోకం అవుతుంది. ఏమాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం సరిదిద్దుకోలేనంతగా వెనక్కి వెళుతుంది... పరాజయం బాటలో నడుస్తుంది.

తొలిసారి పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మవిశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలలో చేరామన్న ఉత్సాహం, కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కలిగించే ఆనందం వెరసి విద్యార్థులకు కళాశాల దశ కొత్త అనుభూతిని ఇస్తుందనే చెప్పాలి. అనువైన గ్రూపు, ఇష్టమైన పాఠ్యాంశాలు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇంటర్మీడియట్ విద్య. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్మీడియట్‌లోనే పడతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినా, గాడితప్పి అంధఃపాతాళానికి పడిపోయినా ఇంటర్మీడియట్‌లోనే బీజాలు పడతాయి. హైస్కూల్ విద్యతో ప్రారంభమయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ ఎంతో ప్రధానమైనది.

చదువుపైనే దృష్టి సారించాలి..

ఇంటర్మీడియట్ విద్యార్థులు టీనేజీలో ఉంటారు. కనుక వారి ఆలోచనలు చాలా భిన్నంగా ఉంటాయి. కొన్నింటి పట్ల వెంటనే ఆకర్షితులవుతారు.

అయితే మనసును అదుపులో వుంచుకొని తొలి ప్రాధాన్యత చదువుకే ఇవ్వాలి. మనసును అదుపులో ఉంచుకోకుంటే జీవితం అల్లరి పాలయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. సినిమాల్లో చూపించేలా కాలేజీకి డుమ్మా కొట్టడం హీరోయిజం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులు ఇచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవడం, పోటీ పరీక్షలకు అనువుగా ప్రణాళికలను రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి చదువుకోవడం వంటివి ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడతాయి.

స్నేహితుల ఎంపిక చాలా ముఖ్యం..

ప్రధానంగా ఇంటర్మీడియట్‌లో స్నేహితుల ఎంపిక చాలా ముఖ్యమైనది.

ఇంటర్‌లో ఏర్పడే స్నేహాలు విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తాయి. టెన్త్ వరకు తల్లిదండ్రుల పెంపకం వల్ల చాలా మంది విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తారు. ఇంటర్ దశలో స్నేహాల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా వుంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల స్నేహాల గురించి తెలుసుకోవాలి. తమ పిల్లలు సరైన వారితో స్నేహం చేయకుంటే ఆ విషయాన్ని పిల్లలకు సున్నితంగా చెప్పి పిల్లలను తమ దారిలోకి తెచ్చుకోవాలి. తల్లిదండ్రులు ఎవరితో అయినా స్నేహం చేయవద్దు అంటే పిల్లలు కూడా తల్లిదండ్రుల మాటను పెడచెవిన పెట్టకుండా చెడ్డవారి స్నేహానికి దూరంగా ఉండాలి. మంచివారితో స్నేహం మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది, చెడ్డవారితో స్నేహం ఉజ్వలంగా ఉండాల్సిన భవిష్యత్తును దెబ్బతీస్తుంది.

ఏఐని దృష్టిలో ఉంచుకోవాలి..



ఇంతవరకు జరిగింది, ప్రస్తుతం జరుగుతుంది ఒక ఎత్తు అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో జరగబోయేది మరో పెద్ద ఎత్తు. అందువల్ల ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు ఏఐని దృష్టిలో ఉంచుకొని గ్రూపును ఎంపిక చేసుకోవాలి. ఏఐ వల్ల భవిష్యత్తులో ఎలాంటి విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయో మేధావులు సైతం సరైన అంచనా వేయలేక పోతున్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి తన మేధస్సును అనునిత్యం వేగవంతం చేసుకోగలిగితేనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోగలరు.

– కాశిగారి ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, అన్నమాచార్య యూనివర్సిటీ, రాజంపేట

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..



టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్మీడియట్‌లో చేరగానే విద్యార్థులు ఓ కొత్త ప్రపంచంలో విహరిస్తారు. ఇంటర్మీడియట్‌లో బాగా చదువుకుంటేనే ఉన్నత చదువుల్లో నచ్చిన రంగంవైపు పయనించవచ్చు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటర్‌లో చేరగానే వారికి స్వేచ్ఛనిస్తారు. అయితే అది ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇంటర్‌లో కూడా పిల్లల పట్ల తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. అప్పుడే విద్యార్థులు సరైన మార్గంలో పయనించి చదువుల్లో రాణించగలరు.

– మునగాల కృష్ణకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ, రాజంపేట

కలలను సాకారం చేసుకోవాలి..



విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైనది. ప్రతి విద్యార్థి అనవసరమైన ఆలోచనలను దరిచేరనివ్వకుండా శ్రద్ధగా చదివితే సునాయాసంగా కలలను సాకారం చేసుకోగలరు. కాలేజీలో చేరామన్న మితిమీరిన స్వేచ్ఛ ఉండకూడదు. ఉన్నత చదువులు చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. మా కళాశాలలో చేరే ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం. అలాగే ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలను కూడా సాధిస్తున్నాము.

– ఎస్వీ రమణరాజు, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట